క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీరామకోటి మహాయజ్ఞం



పూజల్లో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి: రొట్టవలస శ్రీరామానందాశ్రమంలో సోమవారం శ్రీరామకోటి మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామకోటి స్థూప ప్రతిష్ట జరిగింది. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు తొత్తడి వెంకటరమణస్వామి, కమిటీ సభ్యులు తొత్తడి వైకుంఠరావు, తొత్తడి రమేష్‌బాబు, వేదపండితులు పాల్గొన్నారు.

బాడీబిల్డర్‌కు సత్కారం



సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

నరసన్నపేట: మండలంలోని కంబకాయకు చెందిన పాగోటి సతీష్‌కుమార్‌కు నరసన్నపేట లయన్స్ క్లబ్ ప్రతినిధులు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు. జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీలో జూనియర్ విభాగంలో సతీష్ బంగారు పతకం పొందిన విషయం విదితమే. నరసన్నపేట మండలం ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన సతీష్‌కు ఆర్థిక సహాయం చేస్తూ శాలువతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ సాహూ ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఊణ్ణ రంగనాథ్, సాయిరాం, తూముల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు సోమవారం ఉదయం పరీక్ష నిర్వహించారు. 235మంది విద్యార్థులకు గాను 212 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి తెలిపారు.

పాఠశాలలో సైకిల్‌షెడ్ ప్రారంభం



షెడ్‌ను ప్రారంభిస్తున్న వెంకటరావు

కొత్తూరు: నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, దాతలు అందజేసిన రూ.5 లక్షలతో నిర్మించిన సైకిల్ షెడ్‌ను, ఇతర అభివృద్ధి పనులను ఆకులతంపరకు చెందిన నక్క శంకరరావు సోమవారం ప్రారంభిచారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సువ్వారి నిర్మల, మాజీ సర్పంచ్‌లు రమణరావు, వీరభద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గ సమావేశం నిర్వహించాలి

నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయతీ పాలకవర్గ అత్యవసర సమావేశం నిర్వహించాలని వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్తా, ఆర్.శ్రీధర్, బీఎల్ శర్మ, ఇప్పిలి నీలం తదితరులు సోమవారం డిమాండ్ చేశారు. ఈ నెల 16న అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని 15 మంది వార్డు సభ్యులు సంతకాలతో ఈఓ ద్రాక్షాయనికి వినతిపత్రం ఇచ్చామని, అయినా ఇంత వరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేశారు.

ఆదివాసీ అభ్యర్థులపై పోలీసు జులుం సరికాదు



మాట్లాడుతున్న నిమ్మక అప్పన్న

కొత్తూరు : పాడేరు పరిధిలో ఆదివాసీలకు కేటాయించిన ఉపాధ్యాయ పోస్టులను ప్రత్యేక డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలంటూ నిరసన చేపట్టిన అభ్యర్థులపై పోలీసు జులుం సరికాదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సవర అప్పన్న అన్నారు. కొత్తూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీలకు కేటాయించిన ఉపాధ్యాయ పోస్టులను ఆదివాసీలతో భర్తీ చేసినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఆయనతో పాటు పలువురు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో.. ఆరోగ్య సిరులు



గొట్టిపల్లిలో చిరుధాన్యాల విత్తనాలు పంపిణీ చేస్తున్న కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు



కరడాసింగిగూడలో జొన్న పంట

- 416 ఎకరాల పోడుభూముల్లో చిరుధాన్యాల సాగు
- ప్రత్యేకంగా దృష్టి సారించిన గిరిజన రైతులు
- సహకారం అందిస్తున్న వెలుగు సంస్థ



ఎర్రమానుగూడలో నల్ల నువ్వులు పంట

మెళియాపుట్టి: చిరుధాన్యాల సాగుపై గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో 416 ఎకరాలలో చోడి(రాగులు), కొర్రలు, కందులు, సామలు, జొన్నలు, నల్ల నువ్వులు వంటి పలు రకాల చిరుధాన్యాలు పండిస్తున్నారు. కొత్తూరు వెలుగు అసోసియేషన్(స్వచ్ఛంద సంస్థ) సభ్యులు రాయితీపై విత్తనాలు అందిస్తూ సహకారం అందిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల బాధితులు ఇటీవల కాలంలో ఎక్కువవడంతో చిరుధాన్యాలకు గిరాకీ ఏర్పడింది. కరోనా తర్వాత అత్యధిక శాతం మంది ఆహారపు అలవాట్లను మార్చుకున్నారు. ఎటువంటి ఎరువులు ఉపయోగించకుండా సాగిస్తున్న పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వారపుసంతల్లో విక్రయాలు నిర్వహిస్తున్నామని, పలువురు మైదాన ప్రాంతా వ్యాపారులు గిరిజన గ్రామాలకే వచ్చి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని ఎకరాలలో చిరుధాన్యాలు పండిస్తామని అంటున్నారు.

ఆరోగ్యం మనచేతుల్లో



కీళ్ల సమస్యలు, మధుమేహం, అధిక బరువు పెరగటం, కంటి చూపు మందగించడం వంటి వ్యాధులు అతిచిన్న వయసులోనే వస్తున్నాయి. దానికి కారణం ఆహారపు అలవాట్లే. అయితే చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్యప్రయోజనాలు పొందవచ్చు. మార్కెట్లో చిరుధాన్యాలతో తయారు చేసిన బిస్కెట్లు, ఇతర ఆహార ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. ఉదయం టిఫిన్ కూడా చిరుధాన్యాలతో తయారుచేసుకోవచ్చు. చిరుధాన్యాలకు అలవాటు పడితే ఆరోగ్యం మనచేతుల్లో ఉంటుంది.

– డాక్టర్ అలేఖ్య, పీహెచ్‌సీ వైద్యులు, మెళియాపుట్టి

తక్కువ పెట్టుబడితో..



చిరుధాన్యాల సాగుచేయడానికి పెట్టుబడులు తక్కువ. ఎకరా విస్తీర్ణంలో పోడు వ్యవసాయం చేస్తున్నాను. జొన్నలు సామలు, కందులు ఇతరత్రా విత్తనాలను కొత్తూరు వెలుగు అసోసియేషన్ వారు రాయితీపై అందిస్తున్నారు. చిరుధాన్యాల సాగు ఆర్థికంగా పురోభివృద్ధి చేకూర్చడమే కాకుండా పలువురుకి ఆరోగ్యం అందిస్తున్నాయి. వ్యవసాయ అధికారులు మరింత సహకారం అందించాలి.

– ఎస్.చంద్రరావు, నేలబొంతు గ్రామం, మెళియాపుట్టి మండలం

గిరాకీ ఉంది..



ఎకరా 20 సెంట్లలో నల్లనువ్వులు పంట సాగు చేస్తున్నాను. ఈ విత్తనాలు ఒడిశా నుంచి తీసుకొచ్చాం. మా గ్రామంలో సుమారు పది కుటుంబాలు ఈ పంట సాగు చేస్తున్నాయి. వీటికి చాలా గిరాకీ ఉంది. లాభాలు సైతం అధికంగానే వస్తున్నాయి. కుటుంబాలతో సహా కష్టపడుతున్నాం. ఫలితం కూడా ఆశించేవిధంగానే ఉంది.

– సవర బాబూరావు, పాత్రలోవ గ్రామం, మెళియాపుట్టి మండలం

మండలం	మెళియాపుట్టి	కొత్తూరు	పాతపట్నం	హిరమండలం	ఎల్.ఎన్.పేట
చిరుధాన్యాల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	102	74	94	62	28
రైతులు	128	91	82	68	47

కూటమి అక్రమాలను అరికట్టాలి

- గ్రీవెన్స్‌లో చింతాడ రవికుమార్ ఫిర్యాదు



డీఆర్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న చింతాడ రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆమదాలవలస నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ అక్రమాలపై దర్యాప్తు చేపట్టాలని వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

- ఆమదాలవలస నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ఇసుక మాఫియాగా ఏర్పడి దోపిడీకి పాల్పడుతున్నారని, మంత్రి లోకేష్ పేరు చెప్పి దందా సాగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మాఫియాను అరికట్టాలని కోరారు. గ్రీవెన్స్‌కు హాజరైన వారిలో పైడి పోలయ్య, పలువురు కార్యకర్తలు ఉన్నారు.
- సరుబుజ్జిలి మండలం డకరవలస పంచాయతీలో ఎటువంటి ఆవాసాలు లేని, ఇతర గ్రామాలకు రహదారి కాకుండా టీడీపీ నాయకుల సొంత పొలాలకు రూ.40 లక్షల ఉపాధి నిధులతో రోడ్డు మంజూరు చేశారని ఫిర్యాదు చేశారు. సుభద్రాపురంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో మేట్ల నియామకంలో పక్షపాత ధోరణి వహిస్తున్నారని, పని చేసేవారిని తప్పించి అధికార పార్టీ కార్యకర్తలకు మేట్లు అప్పగిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఆమదాలవలస మండలం కొర్లకోటలో మురుగునీటి కాలువల నిర్మాణం జరిపి మురుగునీటిని జిరాయితీ పొలాల్లోకి వదిలివేయడం, సాంకేతిక లోపాలపై ఫిర్యాదు చేశారు.
- బూర్జ మండలం నీలాదేవిపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఇబ్బందిపెడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, రాజకీయ ఒత్తిడ్లు తగ్గించాలని కోరారు.
- పొందూరు మండలం కింతలి గ్రామంలో దివ్యాంగ బాలుడి వివరాల నమోదులో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్ విగ్రహం కూల్చివేత బాధాకరం

జలుమూరు: శ్రీకాకుళం రూరల్ మండలం బైరి జంక్షన్‌లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని కూల్చివేయడం బాధాకరమని ఎంపీపీ వాన గోపి అన్నారు. సోమవారం జలుమూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదల కోసం అనేక ఉత్తమ పథకాలు ఏర్పాటు చేసిన మహనీయుడి విగ్రహాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసుకుని నిరంతరం స్మరించుకుంటున్నారని, అలాంటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని కూల్చడం సరికాదన్నారు. నిందితులను పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

సరుబుజ్జిలి: ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన ఈ నెల 23న సరుబుజ్జిలి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.పావని ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

పాఠశాలకు వితరణ

హిరమండలం: హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంఘ సేవకుడు సింహాద్రి కాళీ ప్రసాద్ సోమవారం స్టీల్ వాటర్ ట్యాంకర్‌ను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేశవరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ సింహాద్రి కల్యాణి, వైస్ చైర్మన్ అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ఎల్.ఎన్.పేట: భూసారం పెంచేందుకు దోహదపడే పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై విక్రయిస్తున్నట్లు వ్యవసాయాధికారి పైడి లతశ్రీ సోమవారం తెలిపారు. ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నగదు చెల్లించిన వారం రోజుల్లో విత్తనాలు సరఫరా చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే 50 శాతం రాయితీ పోను జీలుగు కిలో విత్తనాలు రూ.61.50, కట్టిజనుము కిలో రూ.54.50, పిల్లి పెసర కిలో రూ.90 చొప్పున రైతులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పెన్షనర్ల ఆందోళన



తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ఆమదాలవలస రూరల్: పెన్షనర్లకు అన్యాయం జరిగితే సహించేది లేదంటూ సోమవారం ఆమదాలవలస మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పెన్షనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం పెన్షనర్లను ఇబ్బంది పెట్టటం సరికాదన్నారు. వివిధ బకాయిలు చెల్లించకుండా పెన్షన్ సవరణ చట్టాన్ని తీసుకురావటం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు మాట్లాడుతూ పెన్షనర్ల న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దాస్యం లక్ష్మణరావు, సురవరపు సిమ్మినాయుడు, ఎం.సత్యనారాయణ, హెచ్.సత్యనారాయణ, కె.షణ్ముఖరావు, టి.సూర్యనారాయణ, పి.భాను, ఎస్.నారాయణరావు, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్కౌట్స్ క్యాడెట్ల సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న స్కౌట్స్ క్యాడెట్లు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కౌట్స్ క్యాడెట్లు సోమవారం గ్రామాల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. హైకింగ్ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాల విశిష్టతపై గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. పాఠశాలలో నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ఎన్‌సీసీ, స్కౌట్స్ విభాగాలు ఉన్నాయని స్కౌట్స్ ఆఫీసర్ కె.గణపతిరావు తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన పాఠశాలగా గుర్తింపు ఉందని, సైన్స్ ల్యాబ్‌లు ఉన్నాయని, పీఎంశ్రీ పథకం అమలవుతుందని హెచ్‌ఎం పైడి వెంకటరావు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి పిల్లలను స్కూల్లో చేర్చాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కొత్తూరు : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీ కన్వీనర్ పనస రమేష్, జి.రాజు డిమాండ్ చేశారు. కొత్తూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మికుల పిల్లల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు విస్మరించడం తగదన్నారు.

అనంతరం కొత్తూరులో భవన నిర్మాణ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తోటాడలో దంత వైద్య శిబిరం

ఆమదాలవలస రూరల్: దంత సంరక్షణపై దృష్టి పెట్టాలని ఉషా కేర్ డెంటల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ స్నేహ జ్యోతి అన్నారు. సోమవారం తోటాడ గ్రామంలో నెహ్రూ యువకేంద్ర అనుబంధ సంస్థ లైఫ్ ఫ్యూయల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు

నరసన్నపేట : ప్రైవేటు విద్యా సంస్థలు విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం ఉచిత సీట్లను పేద విద్యార్థులకు కల్పించాలని ఎంఈఓ దాలినాయుడు సూచించారు. నరసన్నపేట ఎంఆర్‌సీలో ప్రైవేటు స్కూల్స్ యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి సీఎస్‌ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఏప్రిల్ 28 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరించాలని కోరారు.

హిరమండలం: ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని ఎంఈవో రాంబాబు సూచించారు. ఈ మేరకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈవో-2 గొల్లవాడు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



ఆమదాలవలస నుంచి పురుషోత్తపురం వరకు ఆర్‌అండ్‌బీ రహదారిలో సుమారు ఎనిమిది మలుపులు ఉన్నాయి. అందులో పొన్నాంపేట తదితర మూడు చోట్ల ప్రమాదకర మలుపులు ఉండటంతో వాహనచోదకులు ఆందోళనకు గురవుతున్నారు. రేడియమ్ హెచ్చరిక బోర్డులు లేకపోవడం వలన రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు పలువురు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

చీపుర్లు కొనేవారే కరువాయె..



సారవకోట మండలంలోని పలు కొండపోడు ప్రాంతాల్లో సాగు చేస్తున్న చీపుర్లు కొనుగోలు జరగక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్లో గిట్టుబాటు ధరలేకపోవడం, జీసీఎస్ పట్టించుకోకపోవడంతో ఆర్థికంగా అవస్థలు తప్పడం లేదని వ్యక్తం చేస్తున్నారు. కనీసం భద్రపరుచుకోవడానికి కూడా అవకాశం లేకపోవడంతో ఆరుబయటే ఉంచాల్సి వస్తోందని బొంగాడిపేటలో పలువురు గిరిజనులు వాపోయారు.

– సారవకోట

నత్తనడకన రోడ్డు పనులు



లకిమేర గ్రామ పరిధిలో రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో సోమవారంపేట, లకిమేర మీదుగా సత్యవరం వరకూ తారురోడ్డు నిర్మాణ పనులు ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. రోజులు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు దెబ్బ తింటున్నాయని పలువురు వాపోతున్నారు.

– నరసన్నపేట

ఎమ్మెల్యే గారూ.. ఇదేం తీరు..!

- ఉదయం 9.30 గంటలకని చెప్పి మధ్యాహ్నం 12.30 గంటలకు హాజరు
- తీవ్ర ఇబ్బందులు పడిన గర్భిణులు, బాలింతలు



న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస రూరల్: మండలంలోని జొన్నవలస ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన ఊయల కార్యక్రమం సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. స్థానిక ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ఉదయం 9.30 గంటలకు కార్యక్రమానికి హాజరవుతారని చెప్పి అధికారులు బాలింతలు, గర్భిణులను తీసుకొచ్చారు. అయితే మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎమ్మెల్యే రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఓవైపు మండుటెండ, మరోవైపు ఉక్కపోత కారణంగా వేచి ఉండలేక నరకయాతన అనుభవించారు. అనంతరం హాజరైన ఎమ్మెల్యే లబ్ధిదారులకు న్యూట్రిషన్, బీబీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసిపిల్లలను ఊయలలో వేసి రక్షించాలని, /పిల్లలను ఆరోగ్యవంతులుగా ఉంచాలన్నారు. వైకల్యం, అవాంఛిత గర్భం గల పిల్లలను చెత్త కుండీలు, ముళ్లపొదల్లో పారిబోయడం బాధాకరమని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, గురుగుబెల్లి ఢిల్లేశ్వరరావు, ఎస్.మురళీ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ర్యాపిడ్ సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ర్యాపిడ్ సర్వే పాడి రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.కరుణాకరరావు అన్నారు. పాతపట్నం, సీది గ్రామాల్లో సోమవారం ర్యాపిడ్ సర్వేను ఏడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం చేపడుతున్న రైతుల వివరాలను సిబ్బంది నమోదు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో గుణాలమ్మ, కుమారి, విజయ్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో ఉత్తమ బోధన

ఎల్.ఎన్.పేట: ప్రతీ విద్యార్థిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎల్.ఎన్.పేట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శివ్వాల తేజేశ్వరరావు అన్నారు. రావిచంద్రిలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రరావుతో కలిసి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కలిగించారు. ఉత్తమ బోధన అందించే ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జనార్దరావు, సీఆర్పీ తవిటినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: చిగురువలసలో ఎంఈఓ కంచరాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ బడుల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు బెండి చిన్నారావు, రామినాయుడు, ఎమ్మార్సీ అకౌంటెంట్ తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిరమండలం: అంబావిల్లి ప్రాథమికోన్నత పాఠశాల పరిధిలో హెచ్‌ఎం ఎల్.వి.రమణ ఆధ్వర్యంలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రభుత్వ పాఠశాలలలో పిల్లలను చేర్పించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, నియోజకవర్గ యాదవ సంఘం నాయకుడు నాగళ్ల మురళీధర్‌యాదవ్ అన్నారు. ఆమదాలవలస పురపాలక సంఘంలోని తొమ్మిదో వార్డు పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి వాంబే కాలనీ, హడ్కో కాలనీలలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవిందరాజులు, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ గొల్లపల్లి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: జలుమూరు ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓలు బి.మాధవరావు, ప్రసాదరావు నేతృత్వంలో ఉపాధ్యాయులు అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మెండ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతపట్నం: బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం రొమదల, బూరగాం, రొంపివలస విద్యార్థులను రొంపివలస పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సీహెచ్ తిరుమలరావు, హెచ్‌ఎం భీమ్‌సేన్ పండా, బుడ్డు, జగన్నాథ్ బిస్వాల్, ఒరియా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.